
హైదరాబాద్‌లో క్రాకర్స్ కాల్చుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్


కుటుంబ సభ్యులతో బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే కేపీ

ఘనంగా దీపావళి సంబరం

● దీపావళి సంబరాల్లో మంత్రి సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కుటుంబ సభ్యులతో ఆదివారం దీపావళి సంబరాలు జరుపుకున్నారు. హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఆయన సతీమణి విజయలక్ష్మి, కుమారుడు విశాల్, కుమార్తె శ్రీష్టిలతో కలిసి మంత్రి క్రాకర్స్ కాల్చారు. ముందుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలను ఆయన కలిసి శాలువాలు కప్పి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

దర్శి: మండలంలో దీపావళి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలు దీపాలతో అందంగా అలంకరించారు. తెల్లవారుజామున తలంటు స్నానాలు చేసి నివాసాల్లో లక్ష్మీదేవికి పూజలు చేశారు. బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వెలుబుచ్చారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు తమ నూతన గృహంలో దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు వేడుకల్లో పాల్గొని బాణసంచా కాల్చి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ నివాసం ముందు బాణసంచా కాల్చి దీపావళి వేడుకలు జరుపుకున్నారు.


మార్కాపురంలో నరకాసుర వధ

మార్కాపురం టౌన్/కొనకనమిట్ల: దీపావళి వేడుకలను ఆదివారం మార్కాపురం నియోజకవర్గ ప్రజలు బాణసంచా కాల్చి ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి నరకాసుర వధ ఘట్టాన్ని నిర్వహించిన అనంతరం మాఢ వీధుల్లో ఊరేగించారు. పట్టణంలోని నాయుడు బజారు, పాండురంగస్వామి గుడి వీధితోపాటు పలు ప్రాంతాల్లో నరకాసుర వధ నిర్వహించారు.


దీపావళి వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి, కుటుంబ సభ్యులు దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యే కేపీ ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

■ కొనకనమిట్ల మండలంలోని వెలుగొండస్వామి ఆలయం, గొట్లగట్టు రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, పెదారికట్ల శివాలయంలో మహిళలు పూజలు నిర్వహించారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దిశానిర్దేశం చేశారు. పొదిలి పట్టణ సచివాలయం–2 పరిధిలోని 7, 8 వార్డుల ముఖ్య నాయకులు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. ఎవరి పరిధిలో వారు ఓటరు జాబితాలను పరిశీలించి తప్పొప్పులు సరిచేయాలని చెప్పారు. నాయకులు, గృహసారథులు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మన పిల్లల భవిష్యత్తు కోసం మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరాన్ని తెలియజేయాలన్నారు. వార్డుల్లో ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బందీసాహెబ్, హుసెన్‌పాషా, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

ఘనంగా సత్యసాయిబాబా జయంతి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కంభం: సత్యసాయిబాబా 98వ జయంతి పర బ్రహ్మోత్సవాలను సోమవారం కంభంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చాక్ సెంటర్‌లో ఉన్న సత్యసాయిబాబా ఆలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో భక్తి పెంపొందించాలి

గిద్దలూరు రూరల్: కార్తీక మాసంలో భక్తి కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరిలో భక్తి పెంపొందించాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. కార్తీక మాస వైభవ మహోత్సవ ఆహ్వాన ప్రతికను పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, కోటా సత్యం, శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, బెల్లం రమాదేవి పాల్గొన్నారు.

వాల్మీకి దేవాలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేసిన అనంతరం వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డితో గ్రామస్తులు

కురిచేడు: స్థానిక వాల్మీకి బజారులో అంకె శ్రీను నిర్మిస్తున్న వాల్మీకి దేవాలయానికి జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు లక్ష రూపాయల విరాళం అందజేశారు. అంకె శ్రీను పిక్కిలి వెంకటేశ్వర్లు, అంకె కృష్ణ, కొలూరి నర్సింహ, గంథం బాబూజీలతో పాటు మహిళలను తీసుకుని చీమకుర్తి వెళ్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలను కలిసి ఆలయ నిర్మాణానికి సహకారం కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన వారు వెంటనే లక్ష రూపాయలు ఇచ్చి పంపారు.

8 మంది జూదరుల అరెస్టు

● రూ.1.37 లక్షల నగదు స్వాధీనం

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు గ్రామ పరిధిలో గల రియల్ ఎస్టేట్ ఆఫీసులో పేకాటాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.1.37 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నేడు గంగదేవిపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ గుంటు పోలయ్య తెలిపారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, రథ సారథులు, వలంటీర్లు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, వార్డు మెంబర్లు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోలయ్య కోరారు. కార్యక్రమం సర్పంచ్ ఎగ్గోని కుమారి అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సోమవారం అందజేశారు. పొదిలి గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు రూ.60 వేల చెక్కు, కొనకనమిట్ల మండలం తువ్వపాడుకు చెందిన రామకృష్ణారెడ్డికి మరో చెక్కు అందించారు.

మద్యం బాటిళ్ల కోసం సోదాలు

గిద్దలూరు రూరల్: సంజీవరాయుడుపేటలో మోడిగారి వెంకటేశ్వర్లు అనే మాజీ సైనికుడి ఇంట్లో మద్యం బాటిళ్లు నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని సెబ్ సీఐ అరుణకుమారికి సమాచారం అందించారు. ఆమె గ్రామంలోకి వెళ్లి ఇంటిని పరిశీలించడంతో వారు ఆ ఇంటికి తాళాలు వేసి బెంగళూరు వెళ్లారని తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో సీఐ ఇంటిని సీజ్ చేయించారు. సమాచారం అందుకున్న ఇంటి యజమాని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు సోమవారం గ్రామానికి వచ్చి తమ ఇంటికి ఎవరి అనుమతి తీసుకుని ఏ హక్కుతో తాళం వేస్తారంటూ సెబ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫ్రీజర్ అందజేత

త్రిపురాంతకం: మేడపి ఎంపీటీసీ పి.కృష్ణ ఆధ్వర్యంలో మృతదేహాలను భద్రపరిచే శీతలీకరణ బాక్స్‌ను గ్రామస్తులకు అందజేశారు. దీని ఉపయోగం ఎంతో ఉందన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

మహిళతో కాంపౌండర్ అసభ్య ప్రవర్తన

మార్కాపురం: వైద్యం కోసం వచ్చిన మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కాంపౌండర్‌పై సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక రామలక్ష్మణ వీధిలో ఓ లాడ్జి ఎదురుగా ఉన్న ఆర్ఎంపీ వద్దకు పట్టణానికి చెందిన ఒక మహిళ చికిత్స కోసం సోమవారం రాత్రి వచ్చింది. సూది వేసేందుకు లోపలికి తీసుకెళ్లిన కాంపౌండర్ రాంసింగ్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీ సంజీవిని వృద్ధాశ్రమానికి లయన్స్ క్లబ్ కంభం ఆధ్వర్యంలో నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరూ అదృష్టంగా భావించాలన్నారు. లయన్స్ క్లబ్ కోశాధికారి తన్నీరు బాలరంగారావు, ఉపాధ్యక్షుడు బైసాని వెంకటరామకృష్ణ, వృద్ధాశ్రమం నిర్వాహకులు ఓ. రాజశేఖర్ పాల్గొన్నారు.